అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16: మండల పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలను కలెక్టర్ మను చౌదరి బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా మండలంలోని ఎన్సాన్‌పల్లిలో నిర్మాణం పూర్తయిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్న ఎల్లంకి కళాశాల నుంచి వారం, పది రోజుల్లో నూతన భవనంలోకి తరలించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. మిట్టపల్లిలోని సుడా లేఅవుట్‌ను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఇంకా అమ్ముడు పోని ప్లాట్ల ధరను తగ్గించి మరోసారి అమ్మేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతం మిట్టపల్లిలో అద్దె భవనంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. జిల్లా మహిళా సమాఖ్య భవనం సమీపంలో మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో వెంటనే భవన నిర్మాణం చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్సాన్‌పల్లిలో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

బహిరంగ ప్రాంతాల్లో చెత్తవేస్తే కఠిన చర్యలు

సిద్దిపేట, అక్టోబర్ 16: బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆశిత్ కుమార్ అన్నారు. సిద్దిపేట పట్టణ పరిధిలోని 31 వ వార్డులోని నాసరపురాలో సమయానికి చెత్త సేకరణ వాహనాలు రావడం లేదన్న ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన వార్డులో పర్యటించారు. చెత్త సేకరణ వాహన డ్రైవర్, శానిటరీ ఇన్స్పెక్టర్, జవాన్లను పిలిపించి మాట్లాడారు. ఇందిరమ్మ కాలనీలో పారిశుధ్య సమస్యలపై ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించారు. కుషాల్‌నగర్‌లోని ఇండ్ల మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు తొలిగించాలని శానిటరీ ఇన్స్పెక్టర్‌ను ఆదేశించారు.

సిద్దిపేట పట్టణంలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశిత్‌కుమార్

కంపోస్టు యార్డు పరిశీలన

సిద్దిపేట కమాన్, అక్టోబర్ 16 : సిద్దిపేట పట్టణం శివారు లింగారెడ్డిపల్లిలో కంపోస్టు యార్డు నిర్వహణను మున్సిపల్ కమిషనర్ ఆశిత్‌కుమార్ పరిశీలించారు. డీఈ ప్రేరణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు అన్వేశ్‌రెడ్డి, యాదగిరి, వనిత పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

తొగుట, అక్టోబర్ 16: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పనిచేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీఎం సహాయనిధి ద్వారా మండలంలోని ఎల్ బంజేరుపల్లికి చెందిన రేణుకకు రూ.12000, ఎల్లారెడ్డిపేటకు చెందిన రుక్సానాబీకి రూ.8500 మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు.

నేడు తొగుటలో ఎమ్మెల్యే పర్యటన

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం తొగుట మండలంలో పర్యటించనున్నారని ఆయన తెలిపారు. పెద్ద

ఎల్లారెడ్డిపేటకు చెందిన రుక్సానాబీకి సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి

మాసాన్‌పల్లి, కాన్గల్ పాఠశాలల్లో క్రీడాదుస్తులు, కాన్గల్‌లో వైకుంఠరథం, ఫ్రీజర్లను ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

దుబ్బాక,అక్టోబర్16: చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని దుబ్బాక ఎస్సై గంగరాజు సూచించారు. బుధవారం దుబ్బాక సరస్వతి గ్లోబుల్ పాఠశాలలో బాలికలు, మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, షీ టీమ్ తదితర వాటిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ప్రయోజకులుగా మారాలని సూచించారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళల రక్షణ కోసం

చట్టాలపై దుబ్బాక సరస్వతీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై గంగరాజు

ప్రత్యేక చట్టాలు ఉన్నాయని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. కార్యక్రమంలో షీ టీమ్ బృందం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవసరం మేరకే సెల్‌ఫోన్ వినియోగించాలి

చేర్యాల, అక్టోబర్ 16 : అవసరం మేరకే ప్రజలు సెల్‌ఫోన్ వినియోగించాలని ఎస్సై నిరేశ్ కోరారు. మండలంలోని ముస్త్యాలలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పర్చేందుకు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాఠశాల, కళాశాలకు వెళ్లే పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలన్నారు. గూగుల్ పే, ఫోన్ పే ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూఢ నమ్మకాలను నమ్మవద్దని, సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు , ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు

ముస్త్యాలలో మాట్లాడుతున్న ఎస్సై నిరేశ్

చేయాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు,ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యామ్‌సుందర్, కనకయ్య, హరిప్రసాద్, భిక్షపతి, ప్రకాశ్, శైలజ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

మిరుదొడ్డి అక్టోబర్ 16: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈవో రవీందర్‌రెడ్డి అన్నారు.బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు.ప్రైవేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్

మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న డీఐఈవో రవీందర్‌రెడ్డి

శారద,అధ్యాపకులు రఘువీర్,కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్16: అర్జున్‌పట్ల ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ శాకాహారమే ఆరోగ్యానికి మేలు చేస్తున్నదన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతకుముందు కూరగాయల వల్ల కలిగే ప్రయోజనాలపై 16మంది విద్యార్థులు కూరగాయల చిత్రాలను ప్రదర్శించారు.

కూరగాయల ప్రాధాన్యతపై చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, యశోద, గంగాప్రసాద్, కులకర్ణి, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సిద్దిపేట,అక్టోబర్16: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 8 వేల కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మూడేండ్ల నుంచి పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కాలేజీలు నడపలేమని బంద్ నిర్వహించి దీక్షలు చేపట్టాయన్నారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో సిద్దిపేట పట్టణ నాయకులు నవదీప్ సాయి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త టీచర్లు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్16: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన కొత్త ఉపాధ్యాయులు బుధవారం స్కూళ్లకు వెళ్లి విధుల్లో చేరారు. మద్దూరు మండలంలో 13 మంది, ధూళిమిట్ట మండలంలో15 మంది ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లారు.మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాలలోని ఎంఆర్సీ సెంటర్‌లో ఎంఈవోలు వరదరాజులు, మీనాంజనేయుల చేతుల మీదుగా జాయినింగ్ పత్రాలు అందుకున్నారు. సీఆర్పీ శేఖర్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 16 : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్ర పుట్టిన రోజును పురస్కరించుకొని సిద్దిపేట వాసవి వనిత క్లబ్ ప్రతినిధులు పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా పది మంది పేదలకు దుప్పట్లను క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి పంపిణీ చేశారు.అనంతరం గోసేవలో పాల్గొన్నారు.కార్యక్రమంలో క్లబ్ సభ్యుడు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషి

చేర్యాల, అక్టోబర్ 16 : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక కృషితో మండలంలోని కడవేర్గు, నాగపురి,పోతిరెడ్డిపల్లి,పెద్దరాజుపేట, శబాష్‌గూడెం గ్రామాల ప్రజల చిరకాల కోరిక కార్యరూపం దాల్చిందని మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ కార్యదర్శి గదరాజు యాదగిరి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలుయాదవ్, గదరాజు చందు,బీఆర్ఎస్ యువజన నాయుడు జితేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండమీది కరుణాకర్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు పాలనలో కడవేర్గు సమీపంలోని లోలెవల్ కల్వర్టు ప్రదేశంలో వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు రావడంతో పనులు జరగలేదని, కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు అనంతరం వంతెన నిర్మాణం


కడవేర్గు వద్ద వంతెన నిర్మాణానికి ప్రారంభమైన పనులు

కోసం 10 నెలలుగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఇటీవల జిల్లా కేంద్రంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్న సమావేశంతో పాటు, చేర్యాలలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో కడవేర్గు వంతెన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని మంత్రితో పాటు అధికారులను కోరినట్లు తెలిపారు.దీంతో వంతెన నిర్మాణ పనులకు టెండరుదారుడు శ్రీకారం చుట్టారని, బుధవారం పనులు ప్రారంభించినట్లు తెలిపారు.వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధి లేదు

చేర్యాల, అక్టోబర్ 16 : చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన ప్రజల సౌకర్యం కోసం బీఆర్ఎస్ సర్కారు పాలనలో చేర్యాల పట్టణానికి కోర్టు మంజూరు చేసిందని, దానిని ప్రారంభించేందుకు కాంగ్రెస్ సర్కారు మీనమేషాలు లెక్కించడం శోచనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్‌టౌన్, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం ఆరోపించారు. పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో నాయకులు చైర్మన్,అధ్యక్షులు మాట్లాడారు. నాలుగు మండలాలు, చేర్యాల పట్టణంతో కలిసి మొత్తం 2వేల కేసులు జనగామ కోర్టులో కొనసాగుతున్న క్రమంలో జిల్లాల విభజన జరగడంతో సిద్దిపేట కోర్టుకు కేసులు కేటాయించినప్పటికీ కొన్ని కేసులు జనగామ, మరికొన్ని కేసులు సిద్దిపేటలో ఉండడంతో 2వేల మంది రోజు వారీగా కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ సర్కారు చేర్యాలకు కోర్టు మంజూరు చేసిందని,కోర్టు ఏర్పాటు కోసం

చేర్యాలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భవన వసతి తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా కోర్టుకు అవసరమైన సిబ్బందిని కేటాయించకపోవడంతో కోర్టు ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. వెంటనే కోర్టుకు సిబ్బందిని కేటాయించి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, టౌన్ కార్యదర్శి బూరగోని తిరుపతిగౌడ్, నాయకులు బీరెడ్డి ఇన్నారెడ్డి, రామచంద్రం, బుడిగే శ్రీనివాస్, కందుకూరి సిద్దిలింగం, కూరపాటి మధుసూదన్, పాక పరశురాములు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మిరుదొడ్డి: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై పరశురాములు

హుస్నాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై మహేశ్

మిరుదొడ్డి: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై పరశురాములు

మిరుదొడ్డి ఆక్టోబర్ 16: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్సై పరశురాములు అన్నారు.బుధవారం మిరుదొడ్డి జడ్పీ పాఠశాలలో డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసించి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాలకు బానిసకావొద్దు

కొండపాక (కుకునూర్‌పల్లి), అక్టోబర్ 16 : యువత మాదకద్రవ్యాలకు బానిస కావొద్దని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మావన జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి

ములుగు, అక్టోబర్ 16 : సోషల్ మీడియాతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని తునికిబొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. టీచర్లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

హుస్నాబాద్, అక్టోబర్ 16: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఎస్సై తోట మహేశ్ సూచించారు. హుస్నాబాద్‌లోని శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో షీటీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా రక్షణ చట్టాలపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగిడి నర్సింహారెడ్డి, షీటీమ్ సభ్యులు సదయ్య, స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెజ్జంకి, అక్టోబర్ 16: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై కృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, కొకైన్, మద్యానికి బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 16 : సమాజంలో సగభాగం ఉన్న మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)రాష్ట్ర అధ్యక్షురాలు ఆశలత పిలుపునిచ్చారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఐద్వా జిల్లా మహాసభలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్న నేటి సమాజంలో చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్రం అమలుకు కృషి చేయడం లేదని మండిపడ్డారు. నవీన,శిరీష, శోభ,మంజులత,వరలక్ష్మి,రాజమణి,సుజాత,నర్సవ్వ పాల్గొన్నారు.

నేడు శబరిమలకు మహా పాదయాత్ర

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 16: హుస్నాబాద్ నుంచి కేరళ రాష్ట్రంలోని శబరిమలకు మహాపాదయాత్ర గురువారం ప్రారంభం కానున్నది. హుస్నాబాద్ నుంచి అయ్యప్పస్వామి భక్తులు నరేందర్‌గురుస్వామి, శ్రీనివాస్, భరతం ప్రశ్నలు మహాపాదయాత్ర ద్వారా శబరిమలకు వెళ్లనున్నారు. హుస్నాబాద్ నుంచి శబరిమలకు దాదాపు 1250 కిలోమీటర్లు పాదయాత్ర ద్వారా అయ్యప్ప సన్నిధికి చేరుకోనున్నారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్ సర్కారు

సిద్దిపేట, అక్టోబర్ 16: ''కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు.. కానీ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప''గా మార్చిందని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు సామల్ల సాయి ప్రేమ్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు గుజ్జరాజు, పడిగే ప్రశాంత్, జంగిటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పది నెలల కాలంలో రు.80,500 కోట్ల అప్పులు చేసి బడా కాంట్రాక్టర్ల జేబులు నింపి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని ప్రశ్నించారు. వర్షాకాలం పూర్తవుతున్నప్పటికీ రైతు


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భరోసా, ఆసరా పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంట్రాక్టర్ల కోసం ప్రభుత్వం అప్పులు చేస్తున్నదని విమర్శించారు. సమావేశంలో యకులు సాయిచరణ్ గౌడ్, జిల్లాల సంతోష్ గౌడ్, గణేశ్, భానుచందర్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ సైరన్ బిగించవద్దు

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 16 : ప్రభుత్వ అనుమతి లేకుండా ఇష్టానుసారంగా కొందరు సొంత వాహనాలకు పోలీస్ సైరన్ బిగించుకుంటున్నారని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సిద్దిపేట పట్టణంలో కార్ డెక్కర్ దుకాణాల యజమానులకు బుధవారం ఈ విషయమై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ప్రభుత్వ అనమతులు లేకుండా ప్రైవేట్ వాహనాలకు పోలీస్ సైరన్ బిగించవద్దని సూచించారు.ఎవరైన సైరన్ బిగించమని ఇబ్బంది పెడితే తమకు సమాచారం అందివ్వాలన్నారు.కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో మెరుగైన సేవలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్16: ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్. స్వాతి అన్నారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని లద్నూర్, రేబర్తి, వల్లంపట్ల, ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామాలను ఆమె సందర్శించి ఆర్టీసీ బస్సు సౌకర్యాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని రోడ్లను ఆమె పరిశీలించారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల బస్సులు రద్దీగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల ట్రిప్పు లు పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు డీఎంకు విజ్ఞప్తి చేశారు. అనంతరం బైరాన్‌పల్లిలోని చారిత్రాత్మక బురుజును ఆమె సందర్శించి, నాటి పోరాట చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డిపో కంట్రోలర్ టీబీఎస్‌రెడ్డి, నాయకులు మల్లేశం, ఉపేందర్, బాపురాజు, రాంరెడ్డి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

వర్గల్,అక్టోబర్16:మండలంలోని శేరిపల్లికి చెందిన జిన్నా బాల్‌రాజ్ ప్రమాదవశాత్తు మరణించాడు. బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ యాదవరెడ్డి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటిసరఫరాపై సమీక్ష

వర్గల్, అక్టోబర్16: వర్గల్ మండలంలోని ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీటి తీరుపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షతన గ్రామ సేవకులకు శిక్షణ నిర్వహించారు. గ్రామాల్లో నీటిసరఫరా వ్యవస్థలో ఎలాంటి లోపాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవోఖ

మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

లీమ్, ఏఈ గంటా శ్రీధర్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అసౌకర్యాలకు నిలయంగా హుస్నాబాద్ దవాఖాన

హుస్నాబాద్, అక్టోబర్ 16: హుస్నాబాద్‌లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అసౌకర్యాలకు నిలయంగా మారుతున్నదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఆరోపించారు. బుధవారం సీపీఐ బృందంతో కలిసి ఆయన దవాఖానను సందర్శించారు. రోగులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నెల రోజులగా బీపీ మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, రోగులకు సరిపడా మందులు అందుబాటులో ఉంచడంలో జిల్లా వైద్యాధికారులు, స్థానిక సూపరింటెండెంట్ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.ఇటీవల తీవ్ర విషజ్వరాలతో జనం బాధ పడుతున్నారని, కనీసం రక్త పరీక్షలు చేసే యంత్రం చెడిపోయి నెల రోజులు దాటుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. రక్త పరీక్ష చేయించుకున్న

హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

వారు రెండు నుంచి వారం రోజులు వేచి ఉండాల్సి వస్తోందన్నారు. వెంటనే బీపీ, షుగర్ గోలీలు అందుబాటులో ఉంచాలని, అన్ని విభాగాల వైద్యుల నియామకం చేయాలని, రక్త పరీక్షల యంత్రాన్ని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, మల్లారెడ్డి, కుమారస్వామి, బాల య్య, కనకస్వామి, జంగ విజయ, ఎల్లయ్య, చుక్క తిరుపతి, గణేశ